సాక్షి నంద్యాల

మంగళవారం : 23 . మే . 2023

I



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహిం చారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



వెదురు వేలంలో ఆదాయం

రుద్రవరం: స్థానిక ఫారెస్ట్ కార్యాలయ ఆవర ణలో సోమవారం నిర్వహించిన వెదురు వేలంపా టల్లో రూ.12,88,500 ఆదాయం వచ్చినట్లు డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్ తెలిపారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల నిత్యాన్నదాన పథకా నికి సోమవారం కర్ణాటకకు చెందిన ఈశ్వర్ రాయగౌండ రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. దాతకు విరాళాల బాండును అందజేశారు.

న్యూస్‌రీల్

30న పత్తికొండకు సీఎం వైఎస్ జగన్



కర్నూలు(సెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 30వ తేదీన కర్నూలు జిల్లా పత్తికొండకు రానున్నారని కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. పత్తికొండలో నిర్వహిస్తున్న వైఎస్ఆర్ రైతు భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొంటారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వరుసగా ఐదో ఏడాది వైఎస్ఆర్ రైతు భరోసా మొదటి విడతను ఆ రోజు సీఎం అన్నదాతల ఖాతాలో జమ చేస్తారన్నారు. కాగా, సీఎం సభను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

కొనుగోలు కేంద్రాల్ని సద్వినియోగం చేసుకోండి

నంద్యాల (సెంట్రల్): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నాగరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రబీ సీజన్‌కు జిల్లా వ్యాప్తంగా 28 మండలాల్లో 47761.66 ఎకరాల మొక్కజొన్న ఈ–క్రాప్ నమోదు జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం 1545 మెట్రిక్ టన్నులకు గాను 1442.85 టన్నులు కొనుగోలు చేశామన్నారు. అదనంగా 500 మెట్రిక్ టన్నులు సేకరించాలనే ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. జిల్లా వ్యాప్తంగా నమోదు చేసుకున్న 1,279 మంది అన్నదాతలు దళారులకు అమ్ముకోకుండా ప్రభుత్వ మద్దతు ధర రూ.1962 లకు విక్రయించుకోవాలని సూచించారు.

స్కూల్ వాహనాలకు ధ్రువపత్రాలు తప్పనిసరి



మాట్లాడుతున్న డీటీవో శివారెడ్డి

బొమ్మలసత్రం: స్కూల్ వాహనాలకు సరైన ధ్రువపత్రాలు ఉంటేనే రహదారులపైకి అనుమతిస్తామని జిల్లా రవాణా శాఖాధికారి శివారెడ్డి సూచించారు. స్థానిక కార్యాలయంలో స్కూల్ యాజమాన్యాలతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీవో మాట్లాడుతూ జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయని, అప్పటిలోగా పాఠశాలల వాహనాలకు తప్పనిసరిగా అన్ని అనుమతులు పొందాలన్నారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంవీఐలు శ్రీకాంత్, తిమ్మయ్య నాయుడు, రవిశంకర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతా లేకపోయినా నోట్లు మార్చొచ్చు

- నేటి నుంచి రూ.2000 నోట్లు మార్పునకు అవకాశం



కర్నూలు(అగ్రికల్చర్): నోట్లు మార్చుకునేందుకు బ్యాంకులో ఖాతా ఉండాల్సిన అవసరం లేదని, ఏ బ్యాంకులోనైనా రోజుకు రూ.20వేల వరకు మార్చుకోవచ్చని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్(ఎల్‌డీఎం) రామచంద్రరావు తెలిపారు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.2000 నోట్లను ఉపసంహరించుకున్న నేపథ్యంలో ఈ నెల 23 నుంచి మార్చుకోవడం లేదా బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేసుకునే అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ బ్యాంకుల్లో ఆధార్ వివరాలు నమోదు చేసుకొని రూ.2000 నోట్లకు బదులు ఇతర నోట్లు ఇస్తారన్నారు. బ్యాంకు ఖాతాలకు పాన్ కార్డు లింక్ అయి, ఈ–కేవైసీ చేసుకొని ఉంటే ఖాతాల్లో రూ.2000 నోట్లు ఎంత మొత్తమైనా డిపాజిట్ చేసుకునే వీలుందన్నారు. అయితే ఈ డిపాజిట్లపై ఆదాయ పన్ను శాఖ దృష్టి ఉంటుందన్నారు. మార్చడానికి మాత్రం రోజుకు 10 నోట్లు.. అంటే రూ.20వేల వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు. బ్యాంకుల్లో ఉన్న నగదు నిల్వలను బట్టి రూ.2000 నోట్ల మార్పిడికి బ్యాంకులు సహకరిస్తాయన్నారు. సెప్టెంబర్ 23 వరకు డిపాజిట్ చేసుకోవడం లేదా మార్పిడి చేసుకునే అవకాశం ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

పట్టాభిషేకానికి వేళాయె!

- నేడు 3,006 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ
- అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా ప్లాట్ల కేటాయింపు
- 108 ఎకరాల్లో జగనన్న కాలనీ లేఅవుట్
- రోడ్లు, డ్రెయిన్లతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

జగనన్న మేలు మరువం



చాలా సంవత్సరాలుగా నంద్యాలలోని మూలసాగరంలో నివాసం ఉంటున్నాం. మా భర్త లారీ డ్రైవర్. మాకు ఇద్దరు పిల్లలు. కొన్నేళ్లుగా మేము కష్టపడి సంపాదించిన సంపాదన అంతా పిల్లల పోషణ, ఇంటి అద్దెకు సరిపోతుంది. మాకు జగనన్న కాలనీలో ప్లాట్ నెంబర్ 1622 కింద ఇంటి స్థలం వచ్చింది. మరి కొద్ది రోజుల్లో అక్కడే ఇల్లు కట్టుకుని అద్దె భారం తగ్గించుకుంటాం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డి పేదలకు చేస్తున్న మేలును ఎన్నటికీ మరువం.

– ఇంతేటి రవళి, 31వ వార్డు మూలసాగరం, నంద్యాల

ఇంటి పట్టా రావడం ఆనందంగా ఉంది



నంద్యాల మూలసాగరంలో చిన్న అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాం. హోటళ్లలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ఇంటి అద్దె కట్టడం చాలా కష్టంగా ఉంది. సొంత ఇల్లు లేదనే బాధ వెంటాడుతూనే ఉండేది. ఈ క్రమంలో సచివాలయంలో దరఖాస్తు చేసుకోగా జగనన్న కాలనీలో ప్లాట్ నెంబర్ 1186 కింద ఇంటి స్థలం వచ్చింది. మా లాంటి అభాగ్యుల కల నెరవేర్చుతున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. నేడు ఇంటి పట్టా అందుకుంటుండటంతో చాలా ఆనందంగా ఉంది.

– రజియాబీ, మూలసాగరం, నంద్యాల



జగనన్న లేఅవుట్‌లో ప్లాట్లు వేస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): పేదల సొంతింటి కలకు ప్రభుత్వం పట్టాభిషేకం చేయబోతుంది. నంద్యాల పట్టణంలో టీడీపీ నేతల వైఖరి కారణంగా చాలా కాలంగా జాప్యమవుతూ వస్తున్న ఇళ్ల పట్టాల పంపిణీ ఎట్టకేలకు జరుగబోతుంది. ఇందుకు అధికారులు మంగళవారం ముహూర్తం నిర్ణయించి సర్వం సిద్ధం చేశారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా పైసా ఖర్చు లేకుండా స్థలం పంపిణీ చేసి, ఇంటిని నిర్మించే బాధ్యతను ప్రభుత్వం చేపట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే పేదలకు ఇళ్లస్థలాలు పంపిణీ చేసేందుకు అంతా రంగం సిద్ధం చేసింది. భూమిని గుర్తించి అర్హులను ఎంపిక చేస్తుండగా స్థానిక టీడీపీ నాయకులు కోర్టుకు వెళ్లి ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. అయితే కోర్టులో పేదల పక్షాన తీర్పు రావడంతో మంగళవారం అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఇళ్ల పట్టాలను పంపిణీ చేయనున్నారు. టీడీపీ నాయకులు అడ్డుకోకుంటే పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా ఇప్పటికే జగనన్న కాలనీ నిర్మాణం పూర్తయ్యేది. నంద్యాల పట్టణంలో హైవే సమీపంలో 150 ఎకరాల ప్రభుత్వ భూమికి గాను ఎన్జీటీ ఉత్తర్వుల మేరకు 108 ఎకరాల్లో పేదలందరికీ పక్కా గృహాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మొదటి విడతలో సుమారుగా 3,006 మంది లబ్ధిదారులకు వారం రోజుల పాటు జగనన్న కాలనీలోని ప్లాట్లకు సంబంధించిన ఇళ్ల పట్టాలను అందించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పేదలకు పండగలా పట్టాలను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్లాట్ల కేటాయింపు పారదర్శకంగా ఉండేలా అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయాలకు తావు లేకుండా చర్యలు చేపట్టారు. మొదటి విడతలో 3,006 మందికి, రెండవ విడతలో 1,209 మందికి ఇళ్ల పట్టాలను అందించనున్నారు.

మోడల్ కాలనీగా ..

పట్టణంలోని నిర్మించే జగనన్న కాలనీ జిల్లాకే ఆదర్శంగా నిలిచేలా అధికారులు మౌలిక సదుపాయాలు కల్పించబోతున్నారు. 108 ఎకరాల లేఅవుట్‌లో 11 ఎకరాల భూమిని ప్రజా ప్రయోజనాల నిమిత్తం కేటాయించారు. ఈ స్థలంలో కమ్యూనిటీ సెంటర్లు, పార్కులు, ప్రభుత్వ కార్యాలయాలు, నీళ్ల ట్యాంకులు ఏర్పాటు చేయనున్నారు. కాలనీలో ప్రతి రహదారి సీసీ రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, నీటి సౌకర్యాలను అధికారులు అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రైవేటు వెంచర్లకు ఏ మాత్రం తీసిపోకుండా 40 అడుగుల విస్తీర్ణంతో ప్రధాన రహదారులు, 30 అడుగుల విస్తీర్ణంతో అంతర్గత రహదారులు నిర్మించనున్నారు. ప్రధాన రహదారుల మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేసి మొక్కలు నాటనున్నారు. కాలనీ పట్టణానికి చేరువలోనే ఉండటంతో లబ్ధిదారులకు ఎంతో సౌకర్యంగా ఉండనుంది.

అడ్డుకున్న టీడీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటుండగా టీడీపీ నేతలు అడ్డుకున్నారు. కర్నూలు హైవే పక్కనే 150 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి పంపిణీకి సిద్ధం చేస్తుండగా తమ ఉనికికే ప్రమాదమని భావించిన టీడీపీ నాయకులు పర్యావరణం దెబ్బతింటుందనే సాకుతో కోర్టును ఆశ్రయించి పట్టాల పంపిణీని అడ్డుకున్నారు. కాగా కోర్టు ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో పట్టాల పంపిణీకి అడ్డంకులు తొలగిపోయాయి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థలాలు పంపిణీ పూర్తయి ఉంటే ఇప్పటిలోగా అక్కడ జగనన్న కాలనీలో గృహ ప్రవేశాలు జరిగేవి.

ఉచితంగా రూ.లక్షల విలువైన భూమి..

జిల్లా కేంద్రమైన నంద్యాల శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇదే క్రమంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటాయి. సెంటు భూమి సుమారుగా రూ.8లక్షల వరకు ఉంది. పేదలకు ఇళ్ల స్థలాలు పట్టణానికి చేరువలోనే ఇవ్వాలని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి సంకల్పించడంతో అధికారులు కర్నూలు హైవే సమీపంలో ప్రభుత్వ భూమిని గుర్తించి నేడు పంపిణీ చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్షల విలువైన భూమి పేదలకు ఉచితంగా ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి అవసరమైన నిధులు రూ. 1.80 లక్షలు మంజూరు చేసి ఆదుకుంటోంది. అలాగే పొదుపు గ్రూపు మహిళలకు అదనంగా రూ.35వేలు రుణం పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

జగనన్న కాలనీ పేదలకు వరం



ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది రోజుల్లోనే పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే జీర్ణించుకోలేక టీడీపీ నాయకులు కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారు. టీడీపీ నాయకులు వారి ప్రభుత్వ హయాంలో ఒక పట్టా కూడా ఇవ్వలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇస్తుంటే అడ్డుకోవడం దారుణం. వారు సెంటు స్థలం ఇవ్వరు కాని మేము ఇస్తే సెంటు స్థలాన్ని సమాధి స్థలంగా పోల్చడం పేదలను అవమానించడమే. దేవుడు పేదల పక్షాన ఉన్నాడు కాబట్టి కోర్టులో కేసు గెలిచాం. టీడీపీ నాయకులు అడ్డుపడక పోయింటే 150 ఎకరాల్లో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పూర్తయి పేదల గృహ ప్రవేశాలు చేసేవారు.

– శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్యే, నంద్యాల

గృహాలను వేగంగా నిర్మించుకోండి



పట్టణంలోని పేదలందరికీ అర్హత ఆధారంగా ఇంటి స్థలాన్ని కేటాయిస్తున్నాం. మొదటి విడతలో 3,006 మంది లబ్ధిదారులను గుర్తించి వారికి ర్యాండమైజేషన్ ద్వారా ప్లాట్లను కేటాయించాం. రెండో విడతలో మరో 1,209 మందికి ఇళ్ల స్థలాలను కేటాయిస్తాం. లబ్ధిదారులు వేగంగా గృహాన్ని నిర్మించుకుంటే అద్దె భారం తగ్గించుకోవచ్చు.

– రవిచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్, నంద్యాల

అర్జీలకు కచ్చిత పరిష్కారం చూపండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచే అర్జీలకు గడువులోగా కచ్చితమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ పుల్లయ్య వినతులు స్వీకరించారు. స్పందనలోని అర్జీదారుల సమస్యలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా తెలుసుకుని నేరుగా కలెక్టర్ దగ్గరికి తీసుకెళ్లి సమస్యను వివరిస్తున్న తీరు అర్జీదారుల్లో సంతృప్తినిస్తోంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్‌కు సంబంధించి అధికంగా దరఖాస్తులు వస్తున్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీకి అస్పష్ట ముగింపు కాకుండా కచ్చితమైన పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో సరైన కారణాలు వివరిస్తూ అర్జీదారుడు సంతృప్తి చెందేలా ఎండార్స్ ఇవ్వాలన్నారు. టాప్ 4 సర్వీసులలో రేషన్ కార్డులు, పెన్షన్‌కు సంబంధించిన పెండింగ్ అంశాలు, టాప్ 10 సర్వీసుల్లో పెండింగ్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ల అంశాలను పరిష్కరించి క్లియర్ చేయాలన్నారు. స్పందనలో 180 దరఖాస్తులు వచ్చాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ

వినతుల్లో కొన్ని..

- మహానంది మండలం శ్రీనగరానికి చెందిన షేక్ షరీఫా వైఎస్సార్ కళ్యాణమస్తు షాదీతోఫా కింద ఎంపికై పెండింగ్‌లో ఉన్న అంశాన్ని కలెక్టర్ దృష్టికి రావడంతో అక్కడికక్కడే పరిష్కరించారు.
- నందికొట్కూరు హాజీనగర్‌కు చెందిన దేవకుమారి తన భర్త నాగయ్య ఏడాది క్రితం అనారోగ్యంతో మరణించారని, వితంతు పెన్షన్ కోసం సచివాలయానికి వెళితే ఆన్‌లైన్‌లో ప్రభుత్వ ఉద్యోగి అని వస్తోందని, తన భర్త ఎలాంటి ఉద్యోగం చేయలేదని, న్యాయం చేయాలని దరఖాస్తు అందజేశారు.
- గడివేముల మండలం గడిగరేవులలో సర్వే నెం. 577లో 10.90 ఎకరాల భూమిని దాదాపు 80 సంవత్సరాల నుంచి తమ కుటుంబం అనుభవిస్తుందని, కావున ఆ భూమిని ఆన్‌లైన్‌లో తన పేరు మీద ఎక్కించి పాస్ బుక్, వన్ బీ అడంగల్ ఇప్పించాలని కోరుతూ నంద్యాల విశ్వనగర్‌కు చెందిన పి.అంజనేయులు జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు.



పగిడ్యాల మండలం లక్ష్మాపురం రహదారిలో కూలిన చెట్టును జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం



జూపాడుబంగ్లా సమీపంలో వర్షం కురుస్తున్న దృశ్యం

ఒక మోస్తరు వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో అకాల వర్షాల కారణంగా ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుముఖం పట్టాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు కర్నూలు జిల్లాలోని 7 మండలాలు, నంద్యాల జిల్లాలోని 7 మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా మద్దికెరలో 10.4 మిల్లీ మీటర్లు, ఆత్మకూరులో 29.2, బేతంచెర్లలో 20.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాగా సోమవారం సాయంత్రం నుంచి అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిశాయి. ఆలూరులో ఉరుములు, మెరుపులు, పెనుగాలులతో తేలికపాటి వర్షం కురిసింది. గాలుల తీవ్రత వల్ల విద్యుత్ తీగలు తెగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కాగా ఉష్ణోగ్రతలు కాస్త తగ్గడం విశేషం. నంద్యాల జిల్లా శ్రీశైలం డ్యామ్‌లో 42.87 డిగ్రీలు, దొర్నిపాడులో 42.58 డిగ్రీలు, మహానంది మండలం గాజులపల్లిలో 42.09 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కర్నూలు జిల్లా మంత్రాలయంలో 41.55 డిగ్రీలు, కర్నూలు మండలం జి.సింగవరంలో 40.71, ఎమ్మిగనూరు మండలం బనవాసిలో 40.64 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

కలెక్టర్ సంతకం ఫోర్జరీ కేసు కొలిక్కి



పొలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ, రెవెన్యూ సిబ్బంది

- పోలీసుల అదుపులో ఇద్దరు కీలక వ్యక్తులు
- మరో ముగ్గురి కోసం గాలింపు
- వక్ఫ్ భూములను రిజిస్టర్ చేయిస్తామంటూ రూ. 5.10 లక్షలకు డీల్

మహానంది: జిల్లాలో సంచలనమైన కలెక్టర్ సంతకం ఫోర్జరీ కేసును పోలీసులు వేగంగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల విచారణలో ఆసక్తికర అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ఇద్దరి వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. మహానంది మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన సంగా చిన్నయ్య బొల్లవరం పరిధిలోని 486/2 సర్వే నెంబరులో 2.66 ఎకరాల పొలాన్ని గత 20 ఏళ్లుగా సాగు చేస్తున్నాడు. ఇటీవల అతనికి అప్పులు ఎక్కువ కావడంతో పొలం విక్రయించేందుకు సిద్ధమయ్యాడు. పాసుపుస్తకం రైతు పేరు మీద ఉన్నా ఇనాంభూమిగా చూపిస్తుండటంతో రిజిస్టర్ అవ్వకపోవడంతో పొలాన్ని అమ్మలేకపోయాడు. ఈ క్రమంలో ఏడాది క్రితం రైతు అవసరాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు వ్యక్తులు నిషేధిత భూముల జాబితాలో పొలాన్ని తీసేయిస్తామంటూ నమ్మబలికారు. అదే గ్రామానికి చెందిన ఓ యువకుడి ద్వారా నంద్యాల పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన ఉపేంద్ర, మరికొందరు దళారులు రైతుకు పరిచయమయ్యారు. గతంలో ఇలాంటివి చేయించామని, రూ. 5.10 లక్షలకు డీల్ కుదుర్చుకుని రంగంలోకి దిగారు. ముందుగా ఒకసారి రూ. 1.10 లక్షలు, రైతు అల్లుడు వేణుతో మరోసారి రూ. 4.10 లక్షలు ఇప్పించుకున్నారు. అయితే సుమారు ఏడాది నుంచి పని అవకపోవడంతో రైతు చిన్నయ్య వారిని నిలదీశాడు. దీంతో డబ్బులు వెనక్కి ఇస్తూనే నకిలీ పత్రాలను సైతం ఇవ్వడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. బాధిత రైతు తనకు తెలిసిన వారితో ప్రొసీడింగ్స్ ఉత్తర్వుల విషయంపై రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి ఆరా తీయగా కలెక్టర్ సంతకం ఫోర్జరీగా తేల్చారు. డీఆర్‌ఓ పుల్లయ్య ఆదేశాలతో మహానంది తహసీల్దార్ జనార్దన్‌శెట్టి ఫిర్యాదు మేరకు మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి విచారణ చేశారు. బాధిత రైతు చిన్నయ్య తెలిపిన వివరాల మేరకు సోమవారం క్రాంతినగర్‌కు చెందిన ఉపేంద్రతో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. ఈ కేసులో మరో ముగ్గురి పాత్ర ఉందని సమాచారం అందడంతో వారి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలు సేకరిస్తున్నామన్నారని ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ చెప్పారు.

బదిలీల దరఖాస్తుకు నేడు ఆఖరు

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా రవాణ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీల దరఖాస్తుకు నేటితో గడువు ముగియనుందని కర్నూలు జిల్లా ప్రజా రవాణ శాఖాధికారి టి.వెంకటరామం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల మేరకు రిక్వెస్టు ప్రతిపాదికన దరఖాస్తు చేసుకునే కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన రీజినల్ కేడర్(కర్నూలు, నంద్యాల జిల్లాలు కలిపి) శ్రామిక్ నుంచి డ్రైవర్, కండక్టర్, డిపో క్లర్క్, లీడింగ్ హ్యాండ్ వరకు ఉద్యోగులు తమకే దరఖాస్తు చేసుకోవాలని, జోనల్ కేడర్ ఉద్యోగులు కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు, రాష్ట్ర స్థాయి కేడర్ ఉన్న సిబ్బంది విజయవాడలోని చీఫ్ పర్సనల్ మేనేజర్‌కు మంగళవారం సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గతంలో ఇచ్చిన దరఖాస్తులు చెల్లవని, కొత్తగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఓపెన్ స్కూల్ పరీక్షల ఫలితాలు విడుదల

కర్నూలు సిటీ: ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదల అయ్యాయి. సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్ సొసైటీ) ద్వారా టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షలు గత నెల 3వ తేది నుంచి 18 వరకు నిర్వహించారు. టెన్త్ పరీక్షలకు 1,200 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, కేవలం 113 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్ర స్థాయిలో ఈ ఫలితాల్లో 23వ స్థానంలో నిలవగా, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో 1,833 మందికి గాను, 758 మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్ర స్థాయిలో 16 స్థానంలో జిల్లా నిలిచింది. ఈ ఫలితాల్లో మార్కులపై ఏదైనా అనుమానాలు ఉంటే ఈ నెల 30వ తేదీలోపు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు జూన్ 2వ తేదీ లోపు ఫీజు చెల్లించాలి. వచ్చే నెల 26 నుంచి జూలై 4వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఉమ్మడి జిల్లాలో 87 పరీక్ష కేంద్రాలు

నంద్యాల న్యూటౌన్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి ఎస్.వి.ఎస్.గురువయ్యశెట్టి తెలిపారు. సోమవారం స్థానిక ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తున్న పరీక్షలకు 87 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, రేపటి(బుధవారం) నుంచి మొదలు కానున్న పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో వచ్చే నెల 1వ తేది వరకు ఉంటాయన్నారు. రెండు జిల్లాలో ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులు 39,950 మంది పరీక్ష రాయనున్నారని తెలిపారు. కర్నూలు జిల్లాలో 6, నంద్యాల జిల్లాలో 4 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో గది గదికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాల ద్వారా లైవ్‌స్ట్రీమ్ పర్యవేక్షణకు ఇంటర్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం, జిల్లా కలెక్టరేట్, రాష్ట్ర కార్యాలయంలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల్లో తాగునీటి సదుపాయాలతో పాటు, ప్రథమ చికిత్సకు అవసరమైన మెడికల్ టీఎంలను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను కోరినట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాలో 13 కేంద్రాలకు రవాణా సదుపాయం కల్పించాలని ఇప్పటికే ప్రజా రవాణా అధికారులను కోరామని, ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్‌లో అమలులో ఉంటుందన్నారు. సమావేశంలో డీఈసీ మెంబర్లు కె.నాగభూషణం రెడ్డి, పరమేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌ఐఓ గురవయ్య శెట్టి

వెబ్‌సైట్‌లో సప్లిమెంటరీ పరీక్షల హాల్‌టికెట్లు

ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు https://bie.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి ఎస్.వి.ఎస్.గురవయ్య శెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 నుంచి జూన్ 1 వరకు పరీక్షలు జరుగనున్నాయన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు వచ్చే నెల 5 నుంచి 9 వరకు.. నైతిక, మానవ విలువల పరీక్ష జూన్ 2న, పర్యావరణ విద్య పరీక్ష జూన్ 3వ తేదీన నిర్వహిస్తామన్నారు.

క్లుప్తంగా

బాధిత పోలీసు కుటుంబాలకు సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: అనారోగ్యంతో మృతిచెందిన పోలీసులు, హోంగార్డు కుటుంబాలకు మంజూరైన సాయాన్ని ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి సోమవారం అందజేశారు. జిల్లాకు చెందిన ఎస్‌ఐ మాలిబాషా గత నెలలో అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన భార్య జమీలాబీకి విడో ఫండ్ నుంచి రూ. 50 వేలు మంజూరైంది. అలాగే హోమ్‌గార్డులు రమేష్, మోహన్‌రెడ్డి కూడా అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోయారు. వీరిలో మోహన్‌రెడ్డి భార్య దీపికకు రూ. 15 వేలు, రమేష్ తల్లి కొండమ్మకు రూ. 30 వేల చెక్కును వెల్ఫేర్ ఫండ్ నుంచి అందించారు. బాధిత కుటుంబాలకు ఎలాంటి కష్టమున్నా తనను కలిస్తే అండగా నిలబడతామని ఎస్పీ ఈసందర్భంగా భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, డీఎస్పీ మహేశ్వరరెడ్డి, హోమ్‌గార్డు ఇన్‌చార్జ్ తిరుపమ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అప్పుల బాధ తాళలేక..



మృతి చెందిన రైతు రాముడు

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామానికి చెందిన రైతు నడిపి రాముడు (41) అప్పుల బాధతో సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు... రైతు రాముడు కొన్నేళ్ల నుంచి పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయం కోసం ఇతరుల వద్ద రూ.5 లక్షలు అప్పులు చేశాడు. వాటిని తిరిగి చెల్లించాలని ఒత్తిళ్లు అధికం కావడంతో జీవితంపై విరక్తి చెంది క్రిమి సంహారక గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

రంకేస్తున్న ఉత్పత్తి!

- ఒంగోలు జాతి పశుత్పత్తిలో ప్రత్యేకత కనబరుస్తున్న నంద్యాల ఎఫ్ఎస్‌బీ
- ఆధునిక సాంకేతికతతో రైతులకు నాణ్యమైన సేవలందిస్తున్న కేంద్రం
- సెంట్రల్ మానిటరింగ్ యూనిట్ నుంచి రెండుసార్లు ఏ గ్రేడ్
- రాష్ట్ర ప్రభుత్వ చొరవతో రూ.7.45 కోట్ల విలువైన మౌలిక సదుపాయాల కల్పన



సంరక్షణలో ఉన్న వృషభాన్ని తూకం వేస్తున్న దృశ్యం



వీర్య నాళికలను క్రమపద్ధతిలో అమర్చుతున్న అధికారులు

నంద్యాల(సెంట్రల్): రాజసానికి చిరునామా, బల ప్రదర్శనలో మేటి, నడకలో దర్పం.. ఇవీ ఒంగోలు గిత్తలంటే గుర్తుకొచ్చే లక్షణాలు. ఖండాంతరాలు దాటి ఖ్యాతిని ఆర్జించిన ఈ వృషభ జాతి ఉత్పత్తిలో నంద్యాల ఘనీకృత వీర్య కేంద్రం ప్రత్యేకత కనబరుస్తోంది. నెలకు సగటున 55 వేల నుంచి 60 వేల డోసుల ఒంగోలు జాతి వీర్యాన్ని ఉత్పత్తి చేస్తోంది.

దేశీయ జాతుల అభివృద్ధికి ప్రాధాన్యత

నంద్యాల ఘనీకృత వీర్య కేంద్రం 1976లో ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా పశుగణాభివృద్ధి సంస్థ పర్యవేక్షణలో పనిచేసే మూడు ఉప కేంద్రాల్లో ఇదొకటి. ఎటువంటి అంటు వ్యాధులు లేని, మేలుజాతి పశువుల నుంచి కృత్రిమ పద్ధతుల్లో సేకరించిన నాణ్యమైన వీర్యాన్ని రైతులకందివ్వటం ఈ కేంద్రం ప్రధాన లక్ష్యం. ఇక్కడ ముగ్గురు అనుభవజ్ఞులైన వైద్యులు, ఇద్దరు సంచాలకుల స్థాయి అధికారులు పలు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ముఖ్యంగా పశువులకు వసతి కల్పన, ప్రయోగశాలలు, డిస్పాచ్ విభాగాలకు ఒక్కొక్క వైద్యుడు ఉన్నారు. కేంద్రం నుంచి పూర్వ రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు నిల్వ చేసిన వీర్య నాళికల్ని పంపుతున్నారు. దేశీయ జాతుల అభివృద్ధికి ఈ కేంద్రం ప్రాధాన్యత ఇస్తోంది. ఒంగోలు, ముర్రా, పుంగనూరు, మల్నాడ గిడ్డ, గిర్, షాహివాల్ జాతుల వీర్యాన్ని ఉత్పత్తి చేస్తోంది. ప్రస్తుతం పలు జాతులకు చెందిన 60 ఆబోతులు, ఎడ్లను ఇక్కడ సంరక్షిస్తున్నారు. వ్యాధి సోకిన వృషభాలను ఘనీకృత వీర్య కేంద్రం నుంచి వేలం ద్వారా విక్రయించి వాటి స్థానంలో ఆరోగ్యవంతమైన పశువులను తీసుకుంటున్నారు.

చక్కని ఫలితాలు

రాష్ట్రంలోని మిగతా ఉప కేంద్రాల్లో ఒంగోలు జాతి వీర్యోత్పత్తి జరగటం లేదు. ప్రతికూల వాతావరణం, సౌకర్యాల లేమి దీనికి ప్రధాన కారణాలు. మరో వైపు నంద్యాల ఎఫ్ఎస్‌బీ(ఫ్రోజెన్ సెమన్ బ్యాంక్)లో పరిస్థితి ఆశాజనకంగా ఉంది. ఇక్కడి అనుభవజ్ఞులైన వైద్య బృందం సేవలతో ఒంగోలు గిత్తలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. సేకరించిన డోసులో ఒక్కోదాంట్లో 0.25 ఎంఎల్‌కు 20 మిలియన్ శుక్రకణాలు ఉంటేనే నిల్వ చేస్తున్నారు. నిల్వ సమయంలోనూ మైనస్ 196 డిగ్రీల నైట్రోజన్‌ని కచ్చితమైన సమయానుసారం ఉంచుతున్నారు. దీంతోపాటు పశువుల పాకలు, దాణా, టీకాల విషయంలో రాజీ లేకుండా ఉంటుండటంతో చక్కని ఫలితాలు రాబడుతున్నారు. నెలకు సగటున 55 వేల నుంచి 60 వేల డోసుల ఒంగోలు జాతి వీర్యాన్ని ఉత్పత్తి చేస్తున్నారు. అన్నదాతల నుంచి ఎంపిక చేసిన పశువుల్ని వేలంలో మంచి ధరతో కొనుగోలు చేసి ఆర్థికంగానూ దన్నుగా నిలుస్తున్నారు.

రూ.7.49 కోట్లతో పలు అభివృద్ధి పనులు..

రాష్ట్ర ప్రభుత్వ చొరవతో నంద్యాల ఎఫ్ఎస్‌బీలో రూ.7.49 కోట్లతో మౌలిక సదుపాయాల పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రతి పశువుకి విడిగా షెడ్లు, సిబ్బంది గదులు, అధునాతన సాంకేతిక పరికరాల కొనుగోలు తదితరాలకు ఈ నిధులను వెచ్చించనున్నారు. అభివృద్ధి పనులతో కేంద్రం పనితీరు వేగం పుంజుకుని ఉత్పత్తి భారీగా పెరగనుంది.

విదేశీ పరికరాలు

నంద్యాల ఘనీకృత వీర్య కేంద్రం ద్వారా సంవత్సరానికి 14 లక్షల డోసుల్ని పలు పశుజాతుల నుంచి ఉత్పత్తి చేస్తున్నారు. దీనికోసం ఫ్రాన్స్‌కు చెందిన అధునాతన విదేశీ పరికరాల్ని వాడుతున్నారు. ప్రస్తుతం కేంద్రంలో 12 లక్షల డోసుల వీర్య నాళికలు భవిష్యత్ అవసరాలకు నిల్వ ఉంచారు. ఈ మధ్య కాలంలో పశు గణాభివృద్ధిలో విప్లవాత్మక మార్పుగా చెప్పుకుంటున్న ఎస్ఎస్ఎస్(సెక్స్ సార్టెడ్ సెమన్) ద్వారా కేవలం పెయ్య దూడలు జన్మించే విధానాన్ని ఈ కేంద్రం సైతం అందిపుచ్చుకుంది. దీనికోసం ఉత్తరాఖండ్, పూణె నుంచి 10 వేల ఈ రకం డోసుల్ని తీసుకొస్తున్నారు. ఇక్కడి సిబ్బంది పనితీరును విజయవాడ వీబీఆర్ఐ(వెటర్నరీ బయలాజికల్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్) ఆరు నెలలకొకసారి, ఎస్ఆర్‌డీడీఎల్ అధికారులు సంవత్సరానికొకసారి వచ్చి తనిఖీలు చేస్తారు. అత్యుత్తమ పనితీరుతో సెంట్రల్ మానిటరింగ్ యూనిట్ నుంచి రెండుసార్లు ఏ గ్రేడ్ సాధించటం విశేషం.

రైతులకు నాణ్యమైన సేవలు



ఆధునిక సాంకేతికతతో శ్రేష్టమైన జాతుల పశు ఉత్పత్తికి ఘనీకృత వీర్య కేంద్రం కృషి చేస్తోంది. ముఖ్యంగా ఒంగోలు జాతికి సంబంధించిన వీర్యోత్పత్తి మా కేంద్రంలో తప్ప రాష్ట్రంలో ఎక్కడా ఆశాజనకంగా లేదు. కాలానుగుణంగా పశు వైద్యంలో వస్తున్న మార్పుల్ని అందిపుచ్చుకుంటూ రైతులకు నాణ్యమైన సేవలందిస్తాం.

– డాక్టర్ శ్రీనివాసులు, సహాయ సంచాలకులు, ఘనీకృత వీర్య కేంద్రం, నంద్యాల

బ్యాంక్ ఎదుట పట్టపగలే దోపిడీ

ఆలూరు: నియోజకవర్గ కేంద్రం ఆలూరులో స్టేట్ బ్యాంక్ ఎదుట పట్టపగలే దోపిడీ జరిగింది. రిటైర్డ్ ఉద్యోగి చేతిలో నుంచి రూ. 3 లక్షలు లాక్కొని దుండగులు పరారయ్యారు.వివరాల్లోకి వెళితే.. ఎస్‌బీఐ రిటైర్డ్ ఉద్యోగి గోవిందప్ప సోమవారం బ్యాంక్‌కు వెళ్లాడు. రూ. 3 లక్షలు డ్రా చేసుకున్నాడు. దీనిని గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు గోవిందప్ప డబ్బు సంచితో స్కూటీపై తిరిగి వెళ్తుండగా దానిని లాక్కొని పరారయ్యారు. వెంటనే బాధితుడు సీఐ బి. వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశాడు. అలాగే బ్యాంక్ అధికారులకు చోరీ విషయం చెప్పి సీసీ ఫుటేజీలు పరిశీలించారు. ఇందులో ఇద్దరు వ్యక్తులు డబ్బు సంచి లాక్కొని గుంతకల్లువైపు వెళ్లినట్లు ఉంది. దోపిడీపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి



మృతురాలు

తుగ్గలి: రాంపల్లి రైల్వే ట్రాక్ సమీపంలో పడి ఉన్న గుర్తు తెలియని మహిళ చికిత్స పొందుతూ మృతి చెందారు. డోన్ రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. ట్రాక్ సమీపంలో తీవ్ర గాయాలతో పడి ఉన్న మహిళను స్థానికుల సమాచారంతో సోమవారం చికిత్స నిమిత్తం 108లో పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. కోలుకోలేక అక్కడ మృతి చెందారు. మృతురాలి వయసు 28 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉంటుంది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సెల్: 9441759875 నంబర్‌కు తెలియజేయాలని ఆయన కోరారు.

భక్తులపై దూసుకెళ్లిన కారు

- ముగ్గురు కర్ణాటక భక్తులకు తీవ్ర గాయాలు
- నుజ్జునుజ్జయిన ఓ బైక్
- మహానందిలో ఘటన



గాయపడిన వరలక్ష్మి, నాగలక్ష్మి

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన ఓ భక్త బృందానికి చెందిన కారు అదుపుతప్పి పక్కనున్న భక్తులపై దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. అనంతపురం పట్టణానికి చెందిన సునీత, ఆమె కుటుంబ సభ్యులు మహానందికి వచ్చారు. కారును రన్నింగ్‌లోనే ఉంచి స్థానిక సమాచార కేంద్రం ముందు ఆపారు. కారులో పిల్లలు గేర్లు మార్చడం..అందులో ఉన్న సునీతకు డ్రైవింగ్ రాకపోవడంతో కారు అదుపుకాక అక్కడే మహాద్వారం, రథశాల వద్ద సేదతీరుతున్న బళ్లారికి చెందిన భక్తులపై దూసుకెళ్లింది. ప్రమాదంలో బళ్లారికి చెందిన నాగలక్ష్మి, వరలక్ష్మి, నారాయణస్వామి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడినవారిని వారి బంధుమిత్రులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో పాటు పూజల కోసం వచ్చిన నంద్యాలకు చెందిన రంగస్వామి బైక్ నుజ్జునుజ్జయింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ ప్రమాదానికి కారణమైన కారును స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు. భక్తులకు పెద్ద ప్రమాదం తప్పడంతో వారి బంధువులు ఊపిరిపీల్చుకున్నారు.

ఇద్దరు యువకులపై హత్యాయత్నం



పొలాల్లోకి దూసుకెళ్లిన బొలెరో



గాయాలతో స్టేషన్‌కు వచ్చిన విజయ్ (బుల్లి టీషర్ట్), శ్యామ్

మహానంది: పాతకక్షలు, మనస్పర్థల నేపథ్యంలో ఇద్దరు యువకులపై హత్యాయత్నం జరిగింది. సోమవారం తమ్మడపల్లె వద్ద ఈ సంఘటన చోటు చేసుకుంది. రోడ్డుప్రమాదంగా చిత్రీకరించొచ్చని పక్కా ప్లాన్‌తో చేసినట్లు బాధితులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. మహానంది కాలనీకి చెందిన నాసరి పెద్దకొట్టాలలో వదిలి సమీపంలోని గంగమ్మ దిలోని ఈశ్వర్‌నగర్ విజయ్ తన అక్కను వస్తూ తమ్మడపల్లె గుడి వద్ద బైక్‌ను ఆపి నిలబడ్డాడు. మరో బైక్‌పై వచ్చిన తన బంధువు శ్యామ్ టిఫిన్ కోసం వెళ్లాడు. అప్పుడే మహానందికి చెందిన శాంతకుమార్ అనే యువకుడు బొలెరో వాహనంలో వస్తూ ఆగి ఉన్న విజయ్‌ను ఢీకొట్టడంతో బైక్ ఎగిరిపడగా విజయ్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో గాయపడిన విజయ్‌ను శ్యామ్ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స చేయించారు. ఇదిలా ఉండగా వీరి మధ్య స్థలానికి సంబంధించి ఓ వివాదం, మరికొన్ని వ్యక్తిగత విభేదాలు ఉన్నాయి. ఇవే హత్యాయత్నానికి దారితీసినట్లు బాధితుడు విజయ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ విచారణ చేస్తున్నామని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామన్నారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

- కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లతో జిల్లా కలెక్టర్



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు (హాస్పిటల్): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు (ఎంఎల్‌హెచ్‌పీ) జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. సోమవారం కర్నూలు మెడికల్ కళాశాల ఆవరణలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు వృత్యంతర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించి ప్రసంగించారు. శిక్షణ తీసుకుంటున్న ఎంఎల్‌హెచ్‌పీలు ఏ వ్యాధికి ఏ విధంగా చికిత్స అందజేయాలనేది ప్రాక్టికల్‌గా చూసి నేర్చుకోవడం వల్ల ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పాముకాటు, తేలు కాటు, కుక్క కాటు, రోడ్డు ప్రమాదాలు తదితర కేసులను పట్టణ ఆరోగ్య కేంద్రాలకు పంపకుండా గ్రామ స్థాయిలోనే మెరుగైన వైద్యం అందించే విధంగా ఈ శిక్షణ ఉపయోగపడుతుందని చెప్పారు. విద్యను అభ్యసించే సమయంలో ఎక్కువ శాతం విషయ పరిజ్ఞానం మీదే దృష్టి పెట్టి ఉంటారని, దాని వల్ల చాలా మందికి ఐవీ, ఇంజెక్షన్ వేసే అనుభవం చాలా తక్కువగా ఉంటుందని అన్నారు. ఈ వారంతపు శిక్షణ ద్వారా వైద్యులు పూర్తిస్థాయిలో ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ అందిస్తారన్నారు. శిక్షణలో మెళకువలు నేర్చుకుని గ్రామాల ప్రజలకు చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు పట్టణాల్లోని ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లకుండా వైద్యచికిత్సలు అందించాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ శిక్షణలో మొత్తం 482 మంది వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో పనిచేసే ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొంటున్నారన్నారు. వీరిని 11 బ్యాచులుగా విభజించి ఆరు రోజుల పాటు థియరీ, ప్రభుత్వాసుపత్రిలో ప్రాక్టికల్ రూపంలో శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.దేవసాగర్, కర్నూలు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి, శిక్షకులు ప్రొఫెసర్ పి.సరళ, ప్రొఫెసర్ మంజుల, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కుమారులు అన్నం పెట్టడం లేదు

- స్పందనలో బాధితురాలు ఫిర్యాదు

కర్నూలు: కుమారులు తనకు అన్నం పెట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన సయ్యద్ షహజాది ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డి.ప్రసాద్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి స్పందన కార్యక్రమానికి మొత్తం 98 ఫిర్యాదులు వచ్చాయి.

స్పందన ఫిర్యాదుల్లో కొన్ని...

- జీవనాధారంగా ఉన్న ఇంటిని రాసివ్వాలని కుమారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని కర్నూలు కు చెందిన రామలక్ష్మి ఫిర్యాదు చేశారు.
- ఆక్వా ల్యాబ్స్ స్కీమ్ పేరుతో గొలుసుకట్టు విధానం ద్వారా కర్నూలుకు చెందిన ఓ వ్యక్తి డబ్బులు కట్టించుకుని మోసం చేశాడని కడపకు చెందిన సురేంద్రకుమార్ వాపోయారు.
- వాట్సాప్ స్టేటస్‌కు సేవ్ బడి లోన్ యాప్ లింక్ పంపి మీకు లోన్ వచ్చింది.. క్లిక్ చేయమని చెప్పి ఓ వ్యక్తి మోసం చేసిన సంఘటనపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కర్నూలుకు చెందిన ముక్తియార్ ఫిర్యాదు చేశారు.
- ఏపీ మోడల్ స్కూల్‌లో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఒక వ్యక్తి డబ్బులు తీసుకుని మోసం చేశాడని ఎమ్మిగనూరుకు చెందిన సురేంద్రబాబు ఫిర్యాదు చేశారు. స్పందనకు వచ్చిన ఫిర్యాదులన్నిటిపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని అడిషనల్ ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు కూడా పాల్గొన్నారు.

కాల్వలో పడి యువకుడి మృతి



మృతిచెందిన కె.సుభాష్ నాయక్

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం లోని ఎస్ఆర్‌బీసీ కాల్వలో ప్రమాదవశాత్తు పడి ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గోరుకల్లు తండాకు చెందిన కె.సుభాష్ నాయక్ (26) సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల గాలించారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో కాల్వ వద్ద వెళ్లి చూడగా అక్కడ నీటిలో శవమై కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కాల్వ వద్దకు వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య పిక్కి బాయి, కుమారుడు, కుమార్తె సంతానం.

పేలిన కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లు

- తప్పిన ప్రమాదం.. రూ.లక్ష నష్టం



కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును పరిశీలిస్తున్న ఎస్ఈ ఎం. ఉమాపతి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లు (సీటీఆర్) పేలిపోయాయి. నగరంలోని స్థానిక సంతోష్ నగర్‌లో ఉన్న 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఎండ, వేడి తీవ్రత, అధిక వినియోగం వంటి కారణాలతో సాంకేతిక సమస్య ఏర్పడి సోమవారం సాయంత్రం ఆకస్మాత్తుగా పేలిపోయాయి. దీంతో సబ్‌స్టేషన్ అంతా వేడి పవర్ ఆయిల్ చిమ్ముకుంది. ఆ ఆయిల్ మనిషిపై పడితే శరీరమంతా కాలిపోతుంది. అదృష్టవశాత్తు ఆ సమయంలో అక్కడ ఉద్యోగులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సాంకేతిక సమస్య తలెత్తినప్పుడు సెన్సర్ల ద్వారా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం, ఇతర ప్రమాదాలు జరగకుండా సీటీఆర్‌లు నియంత్రిస్తాయి. దీంతో కొద్దిసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన వెంటనే కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి అక్కడికి చేరుకుని పేలిపోయిన సీటీఆర్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను మళ్లీ పునరుద్ధరించారు. సీటీఆర్ పేలడంతో సంస్థకు రూ.లక్ష నష్టం వాటిల్లిందని ఎస్ఈ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఆరు బర్రెలు మృత్యువాత



మృతి చెందిన బర్రెలు

గోస్పాడు: విద్యుదాఘాతంతో సోమవారం ఆరు బర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన మండలంలోని జూలేపల్లె గ్రామం వద్ద చోటు చేసుకుంది. రెండు రోజులుగా వీస్తున్న ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వ్యవహరించడంతో మేత మేసేందుకు పొలాలకు వెళ్లిన తీగలను తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. పసురపాడుకు చెందిన రెండు బర్రెలు, జూలేపల్లెకు చెందిన నాలుగు బర్రెలు మృతి చెందాయి. ఒక్కో బర్రె దాదాపుగా రూ.50 వేలు పైగానే ఉంటుందని, ఈ మేరకు రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లిందని, నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని పశుపోషకులు కోరుతున్నారు.

వడదెబ్బతో ఇద్దరు ఉపాధి కూలీలు..

నంద్యాల(అర్బన్): వడదెబ్బతో ఇద్దరు ఉపాధి కూలీలు మృతి చెందిన సంఘటన అయ్యలూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు శనివారం ఉదయం గ్రామ సమీపంలో ఉన్న చెరువు కట్ట వద్ద ఉపాధి పనులకు వెళ్లారు. పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన కూలీలు కె.బాలిరెడ్డి (58), పాండురంగమ్మ(45) ఎండ తీవ్రతతో వడదెబ్బకు గురయ్యారు. కోలుకుంటారని కుటుంబీకులు ఇంటి వద్దనే సపర్యలు చేస్తుండగా ఆదివారం ఉదయం ఇద్దరూ అపస్మారకస్థితికి చేరుకుని మృతి చెందారు. మృతి చెందిన కూలీల కుటుంబాలని ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవేశ్వరరెడ్డి కోరారు.

చికిత్స పొందుతూ..

బేతంచెర్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ కోలుకోలేక మృతిచెందినట్లు ఏఎస్‌ఐ తింగమయ్య తెలిపారు. వివరాల్లోకి వెళితే..అవుకు మండలం సంగపట్నం గ్రామానికి చెందిన ఆకుల రంగమ్మ ఈనెల 19న గ్రామస్తులతో కలిసి ఆటోలో ఓర్వకల్లు మండలం కొమ్మిచెర్వు అంజనేయస్వామి దర్శనానికి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా బేతంచెర్ల పట్టణానికి సమీపంలోని అయ్యలచెర్వు వద్ద ఆటో తగిలి గాయాయ్యాయి. బాధితురాలిని బేతంచెర్లలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించగా అక్కడ కోలుకోలేక మరణించింది. ఈమేరకు మృతురాలి కొడుకు శివుడు ఫిర్యాదుతో కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సోమవారం వెల్లడించారు.